RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 223 | సంపుటి 4 | శుక్రవారం | 01-05-2026 | పేజీలు 4 | వెల 3/-



## పల్లెల్లో గంజాయి


# పంజా!

## యువత భవితను చిత్తు చేస్తున్న మత్తు

### గుట్టుగా విస్తరిస్తున్న గంజాయి రవాణా..

- విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న చీకటి వ్యాపారం.
- మత్తుకు బానిసలై.. మాఫియాకు ఏజెంట్లుగా మారుతున్న వైనం..
- సరదా కోసం మొదలై.. సర్వనాశనం చేస్తున్న వ్యసనం..
- అకాల వృద్ధాప్యం, రోగాల బారిన పడుతున్న యువత
- తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే శాపమా?
- పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించాలని నిపుణుల హెచ్చరిక
- జమ్మికుంట, కిష్టంపేట మీదుగా టేకుమట్లకు చేరుతున్న గంజాయి..
- పోలీసుల కన్నుగప్పి గుట్టుగా విక్రయాలు

"తెలంగాణ పల్లె సీమలు ఒకప్పుడు సిరిసంపదలకు, స్వచ్ఛమైన గాలికి నిలయాలు. కానీ, నేడు ఆ పల్లెల్లో మత్తు పొగలు కమ్ముకుంటున్నాయి. 'గంజాయి' అనే భూతం చాపకింద నీరులా విస్తరిస్తూ, రేపటి దేశ భవిష్యత్తు అయిన యువతను అంధకారంలోకి నెట్టేస్తోంది. ఒకప్పుడు కేవలం నగరాలకో, విదేశీ సంస్కృతికో పరిమితమైన ఈ మత్తు మహమ్మారి.. నేడు గల్లీ గల్లీకీ చేరుతోంది. మారుమూల గ్రామాలు సైతం గంజాయి మాఫియాకు అడ్డాలుగా మారుతున్నాయి. సరదా కోసం మొదలయ్యే ఒక చిన్న దమ్ములో.. నిండు నూరేళ్ల భవిష్యత్తు బూడిదవుతోంది. పోలీసులు అక్కడక్కడా దాడులు చేస్తున్నా, నిందితులను పట్టుకుంటున్నా.. అంతకు మించిన వేగంతో గంజాయి సామ్రాజ్యం తన వేళ్లను విస్తరిస్తోంది. అటు అధికారుల నిఘా వైఫల్యం, ఇటు తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం తోడవడంతో.. విద్యార్థులు పుస్తకాల సంచిలో గంజాయి పొట్లాలను మోసే దుస్థితి దాపురించింది. జమ్మికుంట నుంచి టేకుమట్ల వరకు, పెద్దపల్లి నుంచి వరంగల్ బ్యూరో వరకు ఎక్కడ చూసినా మత్తులో జోగుతున్న యువతే కనిపిస్తున్నారు.



2

— వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం ఏప్రిల్ 30 :



2

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- బయ్యారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- దళారులను నమ్మి మోసపోవద్దు..
- ప్రతి గింజను మద్దతు ధరకే కొంటాం: రైతులకు ఎమ్మెల్యే భరోసా
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం

'రైతు సంక్షేమమే పరమావధిగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సాగు కష్టాన్ని గట్టెక్కించే బాధ్యతను సర్కారు తీసుకుంటుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం బయ్యారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తూకంలో తేడాలు లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకమైన సేకరణ జరగాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, దళారుల చేతిలో మోసపోవద్దని ఆయన పిలుపునిచ్చారు."

## సీఎం రేవంత్ రెడ్డి పాలనలో పారదర్శకంగా పథకాల అమలు

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామసభలే లేవు..
- ఇప్పుడే అసలైన ప్రజాపాలన
- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత..
- సంక్షేమ పథకాలకు గ్రామసభలే తొలిమెట్టు..
- దమ్మతండా గ్రామసభలో ఎమ్మెల్యే మురళి నాయక్..
- ప్రజల సమస్యల సమోదుకు ఆదేశం.

3



## ఆటో దొంగ అరెస్టు

- కేసును ఛేదించిన కేయూసీ పోలీసులు..
- నిందితుడి అరెస్ట్.. ఆటో స్వాధీనం..
- టెక్నాలజీ సాయంతో దొంగను పట్టుకున్న వైనం
- వర్షాన్ని ఆసరాగా చేసుకొని రెక్కీ.. దొంగిలించిన ఆటోనే కిరాయికి నడుపుతూ దొరికిపోయిన నిందితుడు




3

## స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ గా డీజీపీ శివధర్ రెడ్డి

- కీలక పోస్టు కట్టబెట్టిన సర్కార్



3

## పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

- మే 11 నుంచి విద్యా వారోత్సవాలు..
- పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి
- 2700 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు..
- డ్రాపౌట్ లపై ప్రత్యేక దృష్టి..
- సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్..
- విద్యా కార్యక్రమాల అమలుపై కీలక ఆదేశాలు
- రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా

4

# పల్లెల్లో గంజాయి పంజా!

## యువత భవితను చిత్తు చేస్తున్న మత్తు



- చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి రవాణా..
- విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న చీకటి వ్యాపారం..
- మత్తుకు బానిసలై.. మాఫియాకు ఏజెంట్లుగా మారుతున్న వైనం..
- సరదా కోసం మొదలై.. సర్వనాశనం చేస్తున్న వ్యసనం..
- అకాల వృద్ధాప్యం, రోగాల బారిన పడుతున్న యువత
- తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే శాపమా?
- పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించాలని నిపుణుల హెచ్చరిక
- జమ్మికుంట, కిష్టంపేట మీదుగా టేకుమట్లకు చేరుతున్న గంజాయి..
- పోలీసుల కన్నుగప్పి గుట్టుగా విక్రయాలు

**వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం ఏప్రిల్ 30 :**

మారుమూల ప్రాంతాల్లో గంజాయి భూతం జడలు విప్పుతోంది. విద్యార్థుల జీవితాలను మత్తులో ముంచేస్తోంది. మత్తుకు బానిసగా మారిన యువతను టార్గెట్ చేసుకున్న గంజాయి మాఫియా చివరకు వారినే ఏజెంట్లుగా మార్చి చాప కింద నీరులా తన సామ్రాజ్యాన్ని విస్తరించింది. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ శాతం మంది ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. టీబీ, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బులతో మంచం పడుతున్నారు. మత్తు పదార్థాలు సరదా కోసం అలవాటు చేసుకొని వాటికి బానిసలై అతిచిన్న వయసులోనే వృద్ధులుగా కనిపించేవారు కొందరుంటే, ఇంకొంత మంది జీవచ్ఛవాల్లా కాలం గడుపుతున్నారు

### చీకటిపడితే చాలు

చీకటిపడితే చాలు చాలా గ్రామాల్లో యువకులు రహస్య ప్రదేశాలకు వెళ్లి గుంపులుగా ఓ చోట చేరి గంజాయి సిగరెట్లు తాగి మత్తుకు లోనవుతున్నారు. యువకులు, మైనర్లు కూడా అలవాటు పడుతున్నారు. అసలు గంజాయి ఎకడి నుంచి సరాఫరా అవుతుంది?. ఎవరు తీసుకొస్తున్నారు?. స్థానికంగా ఎవరు విక్రయిస్తున్నారు?. అనే దానిపై లోతుగా విచారణ చేయాల్సి ఉంది. కొంతమంది జమ్మికుంట, పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేట నుండి కొంత మంది గంజాయి టేకుమట్ల లోని పలు ప్రాంతాలకు తీసుకొస్తున్నట్లు తెలుస్తుంది.

### తోటి మిత్రులకు సైతం..

మొదట్లో కొందరు మాత్రమే ఈ మత్తుకు అలవాటుపడి వ్యసనంగా మార్చుకొని అక్కడితో ఆగకుండా పక్కవారిని ఈ మత్తు పదార్థాలు అలవాటు పడేలా చేసి క్రమంగా వారిని బానిసలుగా చేస్తారు. ఇలా బానిసలైన వారే ఎక్కువగా డ్రగ్స్ సప్లయ్ చేస్తుంటారు. గంజాయికి అలవాటుపడిన యువకులు మిగతావారితో పోలిస్తే ప్రత్యేకంగా కనిపిస్తారు. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలి. ఏదైనా ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే యువకులు దీనివైపు మొగ్గు చూపుతారు. అలాంటివారి ప్రవర్తన ఇంట్లోనూ వేరే విధంగా ఉంటుంది. ఒంటరిగా ఉండడం, ఆలస్యంగా నిద్ర పోవడం, ఆలస్యంగా లేవడం, నేరుగా కళ్లలోకి చూడకుండా పక్కలకు చూస్తూ మాట్లాడడం లాంటివి.ఎరుపు రంగులో ఉంటాయి. వీరు ఒంటరిగా ఉండటానికి ఎక్కువగా ఇష్టపడతారు. మాట్లాడేటప్పుడు కాస్త తడబడుతూ ఉంటారు. శుభ్రతపై మక్కువపోయి, మాసిన దుస్తులతో తిరుగుతుంటారు. కనీసం గడ్డం కూడా చేయించుకోరు.. ఎందుకని అడిగితే అదే ఫ్యాషన్ అంటూ సాకులు చెబుతుంటారు. గతంతో పోలిస్తే పాకెట్ మనీ ఎక్కువ కావాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తుంటారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఇలాంటి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే వైద్యుడిని



సంప్రదించడం మంచిది. పిల్లల నడవడిక, వారి అలవాట్లు, స్నేహాలు, చదువు మొదలైన వాటిని దగ్గరుండి పర్యవేక్షించే బాధ్యత తల్లిదండ్రులదే. ఎందుకంటే మొదట కళాశాల, తర్వాత ఇంట్లో యువత ఎక్కువ గడిపేది. ప్రస్తుతం తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ పనులు చేస్తుండటంతో పిల్లలతో గడిపే సమయం తగ్గిపోతుంది. అందువల్ల పిల్లలపై పర్యవేక్షణ కరువవుతుండటంతో వారు చెడు వ్యసనాల వైపు మొగ్గు చూపుతున్నారు.

# మహిళా రక్షణే లక్ష్యం

**అంజనాపురంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సదస్సు**

**అంజనాపురం, ఏప్రిల్ 30 (ప్రభాత గమనం):**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా, నాలుగో రోజు మహిళా అభ్యున్నతే లక్ష్యంగా క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం కమ్యూనిటీ క్లస్టర్ పరిధిలోని అంజనాపురం గ్రామంలో మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలతో (SHG) ఎస్.ఐ. సాయి కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ. గారు మాట్లాడుతూ, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న గృహ హింస, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలకు చట్టం కల్పించిన రక్షణ కవచాల గురించి వారు విపులంగా వివరించారు.గృహ హింస నిరోధక చట్టం మరియు మహిళల వ్యక్తిగత భద్రతకు సంబంధించిన వివిధ సెక్షన్ల గురించి అవగాహన కల్పించారు.హింసకు గురైనప్పుడు మౌనంగా ఉండకుండా, వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఎలా ఫిర్యాదు చేయాలి అనే అంశంపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.ఆపదలో ఉన్న మహిళలకు తోటి మహిళలు, స్వయం సహాయక బృందాలు అండగా నిలవాలని, సామాజిక మద్దతు వ్యవస్థల ద్వారానే మార్పు సాధ్యమని స్పష్టం చేశారు.కేవలం ఆర్థిక సాధికారత మాత్రమే కాకుండా, సామాజిక భద్రతపై కూడా అవగాహన పెంచుకున్నప్పుడే మహిళా సంఘాలు బలోపేతం అవుతాయని ఈ సమావేశం ద్వారా చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# సీతంపేట మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రాజకీయ జోక్యం

- రైతులకు నష్టంగా మారుతున్న నాయకుల ఆధిపత్యం
- పారదర్శకత లేక ఇబ్బందులు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్

**సీతంపేట, ఏప్రిల్ 30 (ప్రభాత గమనం):**

అన్నదాతకు అండగా నిలవాల్సిన కొనుగోలు కేంద్రాలు రాజకీయాలకు వేదికగా మారుతున్నాయి. సీతంపేట గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో స్థానిక నాయకుల జోక్యం పెరగడంతో సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డు నిర్వహణలో ఉండాల్సిన పారదర్శకత తగ్గిపోవడంతో నాయకులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైకి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతున్నప్పటికీ, లోపాయికారీగా రాజకీయ ప్రయోజనాల కోసం నిబంధనలను మార్చుతున్నారని ఆరోపిస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న వారికి ఒకలా, మిగతా రైతులకు మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా నాయకుల అనుమతి తీసుకోవాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మార్కెట్ కమిటీలు నిర్వహించాల్సిన కొనుగోలు ప్రక్రియలో రాజకీయ జోక్యం పెరగడంతో చిన్న రైతులు నష్టపోతున్నారు. నాణ్యత పేరుతో లేదా టోకెన్ల జారీలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రంలో పారదర్శక విధానాలు అమలు చేయాలని, తూకం, చెల్లింపులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరుతున్నారు.



# వృద్ధురాలికి 'గణేష్ యువసేన' అండ

- మానవత్వాన్ని చాటుకున్న స్వచ్ఛంద సేవా నిధి

**గార్ల, ఏప్రిల్ 30 (ప్రభాత గమనం) :**

కష్టాల్లో ఉన్నవారికి మేమున్నామంటూ భరోసానిస్తూ, సేవా భావమే పరమావధిగా దూసుకుపోతోంది గార్ల పట్టణానికి చెందిన "గణేష్ యువసేన స్వచ్ఛంద సేవా నిధి". ఆపదలో ఉన్న పేదవాడికి ఆసరాగా నిలవాలనే సంకల్పంతో ప్రతి నెలా సభ్యులు జమ చేసే స్వల్ప విరాళాలు, నేడు ఒక నిరుపేద ప్రాణానికి ప్రాణవాయువులా మారుతున్నాయి.గార్ల పుట్టకోట బజారుకు చెందిన బుడిగ ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. పక్షవాతం బారిన పడి కనీసం మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఆమె కాలం వెళ్లదీస్తున్నారు. ఆలనా పాలనా చూసే వారు కరువైన తరుణంలో, ఆమె దైన్యం గురించి తెలుసుకున్న గణేష్ యువసేన ప్రతినిధులు తక్షణమే స్పందించారు.ప్రస్తుతం ఈశ్వరమ్మ బాగోగులను పర్యవేక్షిస్తున్న బయ్య శంకర్ దంపతులకు, యువసేన ప్రతినిధులు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఆమెకు కావాల్సిన మందులు మరియు పోషకాహారం కోసం వినియోగించాలని వారు కోరారు. "సమాజంలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే మా లక్ష్యం. నెలకు రూ. 108 చొప్పున సభ్యులు ఇచ్చే విరాళం ఈరోజు ఒక వృద్ధురాలి కడుపు నింపుతున్నందుకు మాకు గర్వంగా ఉంది."ఈ సందర్భంగా సేవా నిధికి ప్రతి నెలా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న దాతలందరికీ యువసేన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. "పరోపకారాయ పుణ్యాయ" అన్న నానుడిని నిజం చేస్తూ, ఆపదలో ఆసరాగా నిలుస్తున్న ఈ యువకుల చొరవను స్థానికులు మరియు పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- బయ్యారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**బయ్యారం, ఏప్రిల్ 30:(ప్రభాత గమనం)**

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య అన్నారు. గురువారం బయ్యారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధరను వినియోగించుకోవాలని కోరారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.తూకంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా, గైడ్ లైన్స్ ప్రకారం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.చాలా కాలంగా ఎదురుచూస్తున్న కొనుగోలు కేంద్రాన్ని



స్వయంగా ఎమ్మెల్యే ప్రారంభించడంతో స్థానిక రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. వడ్ల సేకరణలో జాప్యం జరగకుండా చూడాలని ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ బాధ్యులు, రైతులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్ఖడే ని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకెన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ భేటీలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పని చేయాలని నిర్ణయించుకున్నారు. జిల్లాలో శాంతి భద్రత మరియు ప్రజా సంక్షేమానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించడమే లక్ష్యంగా కలిసి పనిచేయాలని ఇరువురు అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, ములుగు సీఐ సురేష్, ఇన్ స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.



# సేవా వారసత్వానికి ఘన నివాళి

■ డీజీపీ బి. శివధర్ రెడ్డికి భావోద్వేగ వీడ్కోలు

ప్రభాత గమనం వరంగల్ క్రైమ్ బ్యూరో :




తెలంగాణ పోలీస్ విభాగంలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ కి రాష్ట్ర పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. హైదరాబాద్‌లోని ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) పరేడ్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమం గౌరవం, క్రమశిక్షణ, భావోద్వేగాల సమ్మేళనంగా నిలిచింది. టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్, ఐపీఎస్ పర్యవేక్షణలో నిర్వహించిన వీడ్కోలు పరేడ్‌కు మనన్ భట్, ఐపీఎస్ కమాండ్ చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్లు, హైదరాబాద్ మరియు సైబరాబాద్ కమిషనరేట్లకు చెందిన పది కంటింజెంట్లు, మౌంటెడ్ కంపెనీతో కలిసి అద్భుతంగా పరేడ్ నిర్వహించాయి. ఈ ప్రదర్శనలో పోలీస్ దళం క్రమశిక్షణ, సమన్వయం, నైపుణ్యం ప్రతిఫలించాయి. కార్యక్రమానికి ఉన్నతాధికారులు, సేవలో ఉన్న మరియు పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులు, శిక్షణార్థులు, కుటుంబ సభ్యులు హాజరై గౌరవ నివాళులు అర్పించారు. శివధర్ రెడ్డి సేవా ప్రయాణం తెలంగాణలో పోలీసింగ్ పరిణామానికి ప్రతిబింబంగా నిలిచింది. ఎడమచేతి ఉగ్రవాదం తీవ్రంగా ఉన్న కాలం నుంచి నేటి సాంకేతిక ఆధారిత సవాళ్ల వరకు ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. విశాఖపట్నం, నల్గొండ వంటి జిల్లాల్లో విధులు నిర్వహించిన సమయంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించారు. ఇంటెలిజెన్స్, సమన్వయం, ఫీల్డ్ అమలు మధ్య సమతౌల్యం పాటిస్తూ పోలీసింగ్‌కు కొత్త దిశను చూపించారు. డీజీపీ (హోంపీఎఫ్)గా బాధ్యతలు చేపట్టనున్న సి.వి. ఆనంద్, ఐపీఎస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ మోడల్ ద్వారా ఉగ్రవాదాన్ని ఎదుర్కొన్న విధానం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఆ విజయాల్లో శివధర్ రెడ్డి కృషి అమోఘమని ఆయన పేర్కొన్నారు. తన వీడ్కోలు ప్రసంగంలో శివధర్ రెడ్డి పోలీసింగ్‌లో వచ్చిన మార్పులను స్పష్టంగా వివరించారు. గతంలో అమలులో ఉన్న కఠిన అమలు విధానాల నుంచి ఇప్పుడు ప్రజాకేంద్రిత, సేవాముఖి విధానానికి మార్పు చోటుచేసుకుందని అన్నారు. ముందస్తు అంచనా, సాంకేతిక వినియోగం, ప్రజలతో అనుసంధానం వంటి అంశాలు ప్రస్తుత పోలీసింగ్‌లో కీలకంగా మారాయని చెప్పారు. తెలంగాణలో అమలు చేస్తున్న పలు వినూత్న కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తు సామర్థ్యాల విస్తరణ, ఆధునిక ఫోరెన్సిక్ సదుపాయాలు, హాక్ ఐ వంటి డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు ప్రజలతో పోలీస్ వ్యవస్థను మరింత దగ్గర చేసినట్లు తెలిపారు. ఇవి పారదర్శకతను పెంచడమే కాకుండా, తక్షణ స్పందనకు దోహదపడుతున్నాయని వివరించారు. అలాగే, కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా అనలిటిక్స్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ వినియోగం పోలీసింగ్‌ను మరింత ముందుచూపుతో, సమర్థవంతంగా మార్చుతున్నాయని చెప్పారు. ప్రమాదాలు పెరగకముందే గుర్తించి చర్యలు తీసుకునే విధానం భవిష్యత్తు పోలీసింగ్‌కు మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు. యువ అధికారులకు ఆయన ఇచ్చిన సందేశం స్పష్టంగా నిలిచింది: నిష్ఠతో నాయకత్వం వహించండి, జట్టును ప్రోత్సహించండి, అధికారాన్ని సహానుభూతితో వినియోగించండి. ఒత్తిడి, క్లిష్టతల మధ్య ఈ విలువలే నిజమైన నాయకత్వానికి పునాది అని అన్నారు. తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్–2026 ఫ్యూచర్ రెడీ పోలీసింగ్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా వ్యూహాత్మక దిశను నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో ఇది కేవలం ఒక అధికారిక కార్యక్రమం మాత్రమే కాదు. సేవ, క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన ఒక గొప్ప కెరీర్‌కు నివాళిగా, అలాగే పోలీసింగ్‌లో ఉన్న విలువలను మరోసారి గుర్తుచేసే సందర్భంగా నిలిచింది. మొత్తంగా, బి. శివధర్ రెడ్డి వీడ్కోలు వ్యక్తిగత ఘట్టం మాత్రమే కాకుండా, ప్రజాసేవకు అంకితమైన పోలీసింగ్ తత్వాన్ని మరింత బలపరిచిన ఒక చారిత్రాత్మక సందర్భంగా నిలిచింది.




# ఆటో దొంగ అరెస్టు

■ రూ.50 వేల విలువైన ఆటో రికవరీ ■ నిందితుడిని రిమాండ్ కు తరలింపు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ సర్కిల్ పోలీసులు ఆటో దొంగతనం కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.50 వేల విలువైన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, అరెస్టు చేసిన నిందితుడు పల్లకొండ రాజ్ కుమార్. ఇతను ఓదెలు కుమారుడు. వయస్సు 29 సంవత్సరాలు. రాజ్ కుమార్ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ, పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం మల్కాపూర్ గ్రామంలో నివసిస్తున్నాడు.గత సంవత్సరం అక్టోబర్ నెలలో నమోదైన ఆటో దొంగతనం కేసులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. 2025 అక్టోబర్ నెలలో భారీ వర్షాలు కురిసిన సమయంలో నిందితుడు రెండు, మూడు రోజుల పాటు పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో సంచరిస్తూ, గుండ్లసింగారం రోడ్డులోని సుందరయ్య నగర్ కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోపై కన్నేశాడు. ఆటోను దొంగిలించేందుకు ముందుగానే రెక్కీ నిర్వహించిన నిందితుడు, వర్షాలు తగ్గిన అనంతరం 2025 అక్టోబర్ 30వ తేదీ తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఆటోను అపహరించి తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. అనంతరం అదే ఆటోను కిరాయికి నడుపుతూ జీవనం సాగిస్తున్న క్రమంలో పోలీసులు అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న ఆటో విలువ సుమారు రూ.50 వేలుగా పోలీసులు అంచనా వేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన కేయూసీ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, ఏఏఓ సల్మాన్ పాషా, క్రైమ్ టీం హెడ్ కానిస్టేబుళ్లు అహ్మద్ పాషా, నర్సింగరావు, రవి ప్రసాద్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, జితేందర్లను ఇన్స్పెక్టర్ ఎస్. రవి కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. నేరాలను అరికట్టడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతోందని, ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్క్ చేయాలని పోలీసులు సూచించారు.

# స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ గా డీజీపీ శివధర్ రెడ్డి

■ కీలక పోస్టు కట్టబెట్టిన సర్కార్

ప్రభాత గమనం, హైదరాబాద్ :



స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ గా ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డి ఈరోజు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఆయన సేవలను వినియోగించుకోవాలని భావించిన సర్కారు కీలక పదవి కట్టబెట్టింది. శివధర్ రెడ్డి శాంతిభద్రతలు, రోడ్ సేఫ్టీ, నార్కోటిక్స్ ఇతర అంశాలను పర్యవేక్షిస్తారని జీవోలో పేర్కొన్నారు. చీఫ్ సెక్రటరీ హోదా కల్పించడంతోపాటు నెలకు రెండు లక్షల 25వేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని అందులో పొందుపరిచారు. మూడేళ్ల పదవీకాలం ఉంటుందని ఆయనకు ఓ ఎస్ డి, పర్సనల్ సెక్రెటరీ, ప్రైవేట్ సెక్రటరీ, ఇద్దరు డ్రైవర్ల తో పాటు నలుగురు సిబ్బంది కేటాయించారు.

# ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం పెంపొందించేందుకు కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ఆదాలత్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రవణ్ కుమార్, ఎస్ఐ మంగా పాల్గొని ఆటో డ్రైవర్లు మరియు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై వివరించారు. ట్రాఫిక్ నియమాలు కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి ప్రాణ భద్రతకు సంబంధించినవని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఆటో డ్రైవర్లు ప్రజల భద్రతకు బాధ్యత వహిస్తున్నందున వేగ నియంత్రణ, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, ఓవర్‌లోడింగ్ చేయకపోవడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే విషయాలను స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబాలకు, సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని, ప్రజలు బాధ్యతతో వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# అక్రెడిటేషన్ కార్డులకు గడువు జూన్ 16 వరకు పొడిగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 30(ప్రభాత గమనం):




తెలంగాణ హైకోర్టు జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును 2026 జూన్ 16 వరకు పొడిగించింది. G.O. Ms. No. 252 మరియు దాని సవరణ అయిన G.O. 103ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సహా మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ, విచారణ కొనసాగుతున్నంత వరకు అక్రిడిటేషన్ సదుపాయాలను కొనసాగించాలని వారు కోరారు. పిటిషనర్ల తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఒక నెలపాటు కార్డుల గడువు పొడిగించాలని నిర్ణయించిందని చెప్పారు. అయితే, అది సమ్మర్ సెలవులతో సరిపోతుందని గమనించిన కోర్టు, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గడువును జూన్ 16 వరకు మరింతగా పొడిగించింది. ప్రస్తుత అక్రెడిటేషన్ కార్డులు అన్నీ 2026 జూన్ 16 వరకు చెల్లుబాటు అవుతాయని. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కోర్టు సమయం ఇచ్చింది.

## జర్నలిస్టులకు తాత్కాలిక ఊరట

ఈ నిర్ణయం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అక్రెడిటేషన్ జర్నలిస్టులు అధికారిక కార్యక్రమాలకు అంతరాయం లేకుండా హాజరవుతారు. అలాగే అక్రెడిటేషన్ కు సంబంధించిన అన్ని ప్రయోజనాలు కూడా కొనసాగుతాయి. దీంతో వారి వృత్తిపరమైన పనుల్లో ఎలాంటి ఆటంకం ఉండదు.ఇక ఫెడరేషన్ తరఫున ఒక ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అందులో, వచ్చిన దరఖాస్తుల సంఖ్య, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తులు మరియు వాటి కారణాల వివరాలను కోర్టు ముందు ఉంచాలని కోరారు. ఈ అంశాన్ని తదుపరి విచారణలో కోర్టు పరిశీలించనుంది.ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని పేర్కొన్నారు. శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.కోర్టు తదుపరి విచారణను జూన్ 16, 2026కు వాయిదా వేసింది. ఆ విచారణలో ఈ ప్రభుత్వ ఆదేశాల భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకోనుంది.ఈ పరిణామం రాష్ట్రంలోని మీడియా వర్గాలకు ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ఇది వారి పనిలో స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు, అక్రెడిటేషన్ విధానాలపై కొనసాగుతున్న ఆందోళనలను కూడా వెలుగులోకి తెచ్చింది.

# మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు



హైదరాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత గమనం): మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. గాయని మంగ్లీ తమ్ముడు శివ చౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించారు. రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు మూడు సార్లు డబ్బులు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఖాతాలో డబ్బులు జమ అయిన తరువాత రోజే విత్ డ్రా అయినట్లు తెలిసింది. రమావత్ మధు బ్యాంకు ఖాతాలను సైబరాబాద్ పోలీసులు సీజ్ చేశారు. మధు, హిమకాంత్ రెడ్డి, శివచౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలని బ్యాంకులకు లేఖ రాశారు.

## పదవీవిరమణ అనంతరం
# సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

■ అదనపు డీసీపీ రవి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది సేవా కార్యక్రమాలకు సమయం కేటాయించాలని అదనపు డీసీపీ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో సబ్ ఇన్స్పెక్టర్లు, రాజయ్య, జైపాల్, ఆర్.ఎస్.ఐ యాదయ్య, ఏ. ఎస్. ఐలు దాసరయ్య,బుచ్చయ్య, గోపాల్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ నరహరి ఉన్నారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ సుధీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖ కు సేవాలందించిన పదవీవిరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని. పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని. పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి అందే డబ్బు ను భవిష్యత్తు అవసరాలకు భద్రపర్చుకోవాలని అదనపు డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాస్, సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర,ఆర్. ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శ్రావణ్ కుమార్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పాలనలో
# పారదర్శకంగా పథకాల అమలు

■ మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్
■ దమ్యతండా గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే
■ ప్రజా సమస్యలు అడిగి పరిష్కారం దిశగా అడుగులు

మహబూబాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత గమనం):




గతంలో ఎన్నడు లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేసింది.ఈ నేపధ్యంలోనే మహబూబాబాద్ మండలం ఉమ్మడి మల్యాల గ్రామ పంచాయతీ దమ్యతండా గ్రామపంచాయతిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ..గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్కసారి కూడా గ్రామ సభ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోలేదని మండిపడ్డారు.కేవలం తమ అనుచరులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని దళిత బంధు లాంటి పథకాలను ,ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని బిఆర్ఎస్ నాయకులు విచ్చల విడిగా చేశారని వారిపై మండిపడ్డారు.ప్రజా పాలన రేవంత్ సర్కార్ ఏర్పడ్డాక పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందే విధంగా గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.ఇందిరమ్మ ఇళ్లు కూడా అదేవిధంగా ఎంపిక జరుగుతుందని అన్నారు.ఇదే విధంగా గ్రామంలో సమస్యలు ఏమిటి ఎలా పరిష్కరించాలి అనే వాటిని నమోదు చేసుకొని ఎమ్మెల్యే మురళి నాయక్ సంబంధిత అధికారులను ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి ఆదేశించారు.గ్రామ సభ అంటే గ్రామ అభివృద్ధికి తొలి మెట్టు అని ప్రతి ఒక్కరు ప్రభుత్వం నిర్వహించే గ్రామ సభలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు అన్ని శాఖల మండల అధికారులు ,సర్పంచులు ,ఉమ్మడి మల్యాల గ్రామ పంచాయతీ సర్పంచులు,మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాణిజ్య పంటల సాగుపై
# అవగాహన కల్పించాలి

-జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత గమనం):



గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ, అనిల్ కుమార్, వ్యవసాయ, ఉద్యానవన, ఐకెపి సంబంధిత అధికారులతో ఉద్యానవన, ఆయిల్ పామ్ పంటల సాగు, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ, ఫార్మర్ రిజిస్ట్రీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వచ్చే సీజన్లో జిల్లా రైతులు వరి ధాన్యమే కాకుండా ఇతర వాణిజ్య పంటలు, ఉద్యానవన, మల్బరీ, ఆయిల్ పామ్ తదితర పంటల వైపు మొగ్గు చూపే విధంగా చైతన్య పరచాలనీ, అధిక లాభాలు వస్తున్న నేపథ్యంలో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలను సాగు చేస్తే దేశీయ మార్కెట్లో చాలా డిమాండ్ ఉన్నాయని అందుకు అనుగుణంగా రైతులు పంటలు వేస్తే అధిక లాభాలు వస్తాయని అన్నారు, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మొక్కజొన్న, వరి కొయ్యలను మంటల్లో కాల్చకుండా చర్యలు తీసుకోవాలని పొలంలో వాటిని సేంద్రీయ ఎరువులుగా మార్చుకునే విధంగా చూడాలని, నేచురల్ ఫామింగ్ వైపు మోగే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయాలని పిఎం కిసాన్ ద్వారా లింకులు ఆన్లైన్ చేయాలన్నారు.ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల విషయంలో సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించి రైతుకు మేలు చేయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మల్బరీ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయ పరుచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారని సరిత, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ఏడిఏ లు, ఏఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

- ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలి
- టేకుమట్ల సీఐ మల్లేష్

టేకుమట్ల , ప్రభాత గమనం ఏప్రిల్ 30 :

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని , సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని సీఐ మల్లేష్ అన్నారు. గురువారం మండలంలోని వేలం పల్లి గ్రామంలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల అదుపునకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని వివరించారు. దొంగతనాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు ఉంటే, నిందితులను గుర్తించి కేసు ఛేదించడానికి చాలా తక్కువ సమయంలో సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ నేరాలు లేని వాతావరణం కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు చొరవ తీసుకోవాలన కోరారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ అమూల్య, సర్పంచ్ కూర వెంకటరాజి రెడ్డి, ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# యూత్ అధ్యక్షుడిగా దండు శ్రీనివాస్

కేసముద్రం ఏప్రిల్ 30(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామంలో గత 35 సంవత్సరములుగా వివిధ సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు సేవ అందిస్తూ సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజల మెప్పు పొందుతూ వస్తున్న ఆదర్శ కళా ప్రియ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదర్శ కళ ప్రియా యూత్ వ్యవస్థాపక సభ్యులు మహబూబాద్ టౌన్ ఎస్ఐ ఉల్లి రాముల సూర్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు..యువత సన్మార్గంలో నడుస్తూ దురాలవాట్లకు గురవకుండా మంచి మార్గంలో పయనించాలని యూత్ సభ్యులను కోరారు. భవిష్యత్తులో గ్రామంలో నాయకత్వ లక్షణాలు కలగాలంటే యువతే దానికి స్ఫూర్తి అని అన్నారు. యువత సకల కళ నైపుణ్యంతో విద్యాభివృద్ధిలో క్రీడా రంగంలో నైపుణ్యం కలిగి కొనసాగాలని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.ఆదర్శ కళా ప్రియా యూత్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా దండు శ్రీనివాస్ ను మరొసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ జనరల్ సెక్రటరీగా మంద భాస్కర్, కోశాధికారిగా ఇనుముల కరుణాకర్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ సీనియర్ నాయకులు వేల్పుగొండ ఆనంద్, జన్ను కట్టయ్య, దండు యాకయ్య , పందుల ఆనందం, సామనపల్లి దేవానందం,గడిపెల్లి యాకయ్య, దండు సురేందర్, కుక్కమూడి యాకయ్య,సింగారపు ప్రభాకర్, గడిపెల్లి వెంకట్ కన్న, వడ్లకొండ కిషోర్ కుమార్, పులిపాక పవన్, సామర్లపల్లి యాకయ్య, దండు బాబు, జన్ను చంటి, బంధు భాష తదితరులు పాల్గొన్నారు.



# విత్తనాల నాణ్యతపై డీలర్లకు అవగాహన

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం :

వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన డీలర్లు, కంపెనీ ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులతో అవగాహన సమావేశం గురువారం వరంగల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ నిర్మలతో పాటు పలువురు అధికారులు, డీలర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ అధికారి నీలకుర్తి రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో నాణ్యమైన విత్తనాల సరఫరా, ప్రభుత్వ విధానాలు, అమలులో ఉన్న నియమాలు, చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులకు ధృవీకరించిన విత్తనాలే అందించాల్సిన అవసరాన్ని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల దృష్ట్యా నాణ్యమైన విత్తనాల సరఫరా అత్యంత కీలకమని తెలిపారు. నకిలీ, నాసిరకం విత్తనాల విక్రయాన్ని పూర్తిగా అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ నాసిరకం విత్తనాల విక్రయం, నకిలీ బిల్లులు, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై చర్యలు తప్పవని తెలిపారు. డీలర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌తోనే వ్యాపారం చేయాలని, ప్రతి విక్రయానికి బిల్లులు ఇవ్వాలని, ధృవీకరించిన విత్తనాలనే రైతులకు అందించాలని సూచించారు. అలాగే స్టాక్ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, నాణ్యతలేని లేదా గడువు ముగిసిన విత్తనాల విక్రయాన్ని పూర్తిగా నిషేధించామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విత్తనాల నాణ్యత, పారదర్శకతను పెంపొందించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని అధికారులు పేర్కొన్నారు.

# పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

- మే 11నుంచి విద్యా వారోత్సవాలు..
- పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి
- 2700 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు..
- డ్రాపౌట్ లపై ప్రత్యేక దృష్టి..
- సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్..
- విద్యా కార్యక్రమాల అమలుపై కీలక ఆదేశాలు
- రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా




మహబూబాబాద్ ఏప్రిల్ 30(ప్రభాత గమనం):

గురువారం, హైదరాబాదు నుంచి విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తో కలిసి రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా అన్ని జిల్లాల కలెక్టర్లతో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే విద్య వారోత్సవాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా కార్యక్రమాల అమలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. 2026-2027 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 2700 ప్రభుత్వ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యం లేని పాఠశాలలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటర్, పదో తరగతిలో ఫెయిల్ అయిన ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో మే 11వ తేదీ నుంచి వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో శంకుస్థాపనలు చేయించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులను, ప్రజాప్రతినిధులను, అధికారులను భాగస్వాములు చేస్తూ విద్యా శిబిరాలు, వర్క్ షాప్ లు, బడిబాట, తదితర కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యా వారోత్సవాల కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్, తాగునీటి కొరత ఉన్న పాఠశాలల్లో (యూడైస్) పోర్టల్ ప్రకారం తక్షణమే పనులు పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు పోర్టల్ లో నివేదికలను సరిగా నమోదు చేయాలన్నారు. కేజీబీవీలలో పది, ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులయ్యేలా రెమెడియల్ కోచింగ్ నిర్వహించాలన్నారు. విద్యార్థుల కోసం వేసవి క్యాంపులు నిర్వహించి, సప్లిమెంటరీ కోచింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం విద్యా శాఖ సంచాలకులు మాట్లాడుతూ.. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 16 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు, వార్డు సభ్యులు, పాఠశాల విద్య కమిటీలతో వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. బడిబాట అండ్ పిటిఎం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కింద విద్యార్థుల నమోదుకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బడి బాటపై ర్యాలీలు చేపట్టి, అవగాహన పెంపొందించాలన్నారు. డ్రాపౌట్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, తిరిగి బడిలో చేర్పించాలన్నారు. జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ 1వ, 2వ సంవత్సరం డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించడానికి జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. బాలబాలికల భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలు, చేతి కళలు వంటి కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలన్నారువీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లి దండ్రులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంటర్మీడియేట్ అధికారి మధార్, విద్యాశాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా నియంత్రణే లక్ష్యం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :


సంగెం మండలంకాట్రపల్లి గ్రామ శివారులలో ఓర్సు కార్తీక్ అనే వ్యక్తి అక్రమంగా గుడుంబా తరలిస్తున్నాడని మరియు అమ్ముతున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు సంగం ఎస్సై వంశీకృష్ణ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తూ ఇట్టి వ్యక్తిపై రైడ్ చేయగా 10 లీటర్ల గుడుంబా పట్టుకొని సీజ్ చేయడం జరిగింది, ఈ వ్యక్తి పోలీసులని చూసి అక్కడ నుంచి పారిపోగా 10 లీటర్ల గుడుంబా సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగింది అట్టి వ్యక్తిని కూడా పట్టుకొని అరెస్టు చేస్తామని ఎస్ఐ వంశీకృష్ణ తెలియజేస్తూ , ఈ సందర్భంగా గుడుంబా తయారు చేయడం తరలించడం అమ్మడం వంటివి నిషేధం చట్టరించా నేరం ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోకానిస్టేబుల్స్ కిషోర్, వీరన్న, రాజు పాల్గొన్నారు.



# నూతన వధూవరులకు సీపీఐ నాయకుల ఆశీర్వాదాలు

కేసముద్రం ఏప్రిల్ 30(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీకి చెందిన సిపిఐఎంఎల్ నాయకులు శివారపు శ్రీధర్ దంపతుల కుమార్తె వివాహం గురువారం హరిహర గార్డెన్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలో కేసముద్రం మండల నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మర్రి రంగారావు, నీలం దుర్గేష్, చిలువేరు సమ్మయ్యగౌడ్, వీరు నాయక్ పాల్గొన్నారు.





# మొక్కజొన్న పంట దగ్ధం..

టేకుమట్ల, ప్రభాత గమనం :

భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్ (వి) గ్రామానికి చెందిన కవులు రైతు బోయ రమేష్ మూడు ఎకరాల భూమిని కౌలు తీసుకొని మొక్కజొన్న పంట వేశాడు దీంతో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. చేతికి వచ్చిన పంట కాలిపోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో తీవ్ర నష్టం జరిగిందని కాగా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు



# వేసవి క్రీడా శిబిరాన్ని సందర్శించిన దేశి రాం నాయక్

కొత్తగూడ ఏప్రిల్ 30(ప్రభాత గమనం):

కొత్తగూడ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ లో నిర్వహించబడుతున్న వేసవికాలం క్రీడా శిబిరాన్ని ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు దేశీరాం నాయక్ సందర్శించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ,అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్ నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించారు. అలాగే పాఠశాల నుండి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలో పాల్గొనీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. సమావేశంలో డీడీతో పాటు, ఏటిడివో కొత్తగూడ భాస్కర్, స్థానిక పాఠశాల హెచ్ఎం, డిప్యూటీ డీఈవో సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ కొమ్మాలు, సీనియర్ ఉపాధ్యాయులు దేవిలాల్ పాల్గొన్నారు.

# ఏఎస్ఐ నరోత్తం రెడ్డికి ఘన వీడ్కోలు

- 36 ఏళ్ల సేవల అనంతరం పదవీ విరమణ
- జ్ఞాపికతో సన్మానించిన ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

పోలీస్ విభాగంలో 36 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన పస్ర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ నరోత్తం రెడ్డికి జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకెన్ శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నరోత్తం రెడ్డి పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని, అది జీవితంలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో పగలు–రాత్రి తేడా లేకుండా, పండగల సమయంలో కూడా కుటుంబానికి దూరంగా ఉండి బాధ్యతలు నిర్వర్తించిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలీస్ కుటుంబానికి ఎప్పుడైనా అవసరం వచ్చినా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఆర్ఐ వెంకటనారాయణ, పస్ర ఎస్సై తాజుద్దీన్, నరోత్తం రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLAGE, MAHABUBABAD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374